


## బాధ్యతగా పెరిగితేనే భవిష్యత్ బలపడుతుంది

- విద్యార్థిదశలో అలవాట్లు జీవితానికే అద్దం
- గురువుల గౌరవమే నిజమైన విద్య
- స్వయంపాలనలో మెరుస్తున్న చిన్నారుల ప్రతిభ

**అశ్వారావుపేట, నవంబర్ 14:** జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవం ఎంతో ఉత్సాహంగా, అర్థవంతంగా జరిపోయింది. విద్యార్థుల్లో సామాజిక విలువలు, బాధ్యతాభావం పెంపొందించాలనే లక్ష్యంతో ఈ వేడుకను ప్రత్యేకంగా నిర్వహించారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించిన అనంతరం విద్యార్థులచే స్వయంపాలనా దినోత్సవాన్ని నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పరుచూరి హరిత మాట్లాడుతూ..“విద్యార్థిదశలో అలవర్చుకున్న క్రమశిక్షణ, మన ప్రవర్తన, మన అభిమానం భవిష్యత్తులో మనల్ని ఎంత దూరం తీసుకెళ్తాయో నిర్ణయిస్తాయి. సమాజం పట్ల బాధ్యత కలిగి మెలగాలి. గురువుల పట్ల గౌరవం చూపడం విద్యార్థిగా మన మొదటి కర్తవ్యం,” అని స్పష్టం చేశారు. బహుమతి ప్రదానోత్సవంలో వాసవీక్లబ్ జిల్లా జాయింట్ సెక్రటరీ శీమకుర్తి సుబ్బారావు మాట్లాడుతూ..“చదివిన పాఠశాల, చదువు చెప్పిన గురువులు జీవితాంతం గుర్తుండాలి. స్ఫూర్తిదాయక వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి. ఈ రోజున మీరు నేర్చుకునే ప్రతి పాఠం మీ భవిష్యత్తు బాట చూపుతుంది,” అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. స్వయంపాలనలో మెరుగు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, వాసవీ క్లబ్ అధ్యక్షులు సత్యవరపు బాలగంగాధర్, సభ్యులు కంచర్ల రామారావు, కంచర్ల భాస్కరరావు, కుమార్రాజా, కోరుకొండ రాం మోహరావు, పవన్ కుమార్, సందీప్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధారం పాఠశాలలో చిల్డ్రన్స్ డే సందడి

**సత్తుపల్లి, నవంబర్ 14:** సత్తుపల్లి మండలంలోని సిద్ధారం ఎంపీ యూపీఎస్ పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయంపాలన దినోత్సవం రూపంలో విద్యార్థులు టీచర్ల పాత్రలో ప్రవేశించి తరగతుల్లో పాఠాలు బోధించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు తమకిష్టమైన విషయాలను బోధిస్తూ ఉపాధ్యాయుల బాధ్యతలను అనుభవించగా, ఉపాధ్యాయులు పిల్లల ప్రదర్శనను అభినందించారు. ఈ వేడుకలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లి సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పిల్లి వెంకటేశ్వరావు, కొత్త శ్రీనివాసరావు, పాణం శ్రీనివాసరావు, శ్యాం ప్రసాద్, లక్ష్మణాచారి, జ్యోత్స్న, వినోద్, హరి ప్రసాద్, విద్యార్థినీ%-%విద్యార్థులు పాల్గొన్నారు.




## నేటి బాలలే రేపటి మార్గదర్శకులు

- దమ్మపేట-ములకలపల్లి పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు
- విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరపాటు
- విద్యా అభివృద్ధికి 'నేను సైతం చేయూత' కార్యక్రమం

**అశ్వారావుపేట, నవంబర్ 14:** దమ్మపేట, ములకలపల్లి మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నారుల హక్కులు, భవిష్యత్తు రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. బాలలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది అని హామీ ఇచ్చారు. పాఠశాలల అభివృద్ధిని వేగవంతం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. విద్యా ప్రోత్సాహానికి రూపుదిద్దిన 'నేను సైతం చేయూత' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఉచితంగా విద్యా సామాగ్రిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉన్న వారి సహకారంతో ఇప్పటికే పలు పాఠశాలల్లో విద్యా సామగ్రి పంపిణీ జరిగినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సింగరేణిలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌కు పెన్షనర్ల స్పందన

- కొత్తగూడెంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం
- యాప్ ద్వారా సర్టిఫికేట్ సమర్పణ సులభం
- సైబర్ మోసాలపై పెన్షనర్లకు హెచ్చరిక

**కొత్తగూడెం, నవంబర్ 14:** కొత్తగూడెం ఏరియా సమాచార శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని ఆర్‌సి ఓ ఏ క్లబ్, రుద్రంపూర్‌లో నిర్వహించారు. సింగరేణి సంస్థ, బొగ్గు గనుల భవిష్యనిధి సంస్థలు కలిసి పెన్షన్ పొందువారికి డిజిటల్ సర్టిఫికేట్ సమర్పణ విధానంపై అవగాహన కల్పించాయి. కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు అధ్యక్షత వహించగా, సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ ఎం. కనకమ్మ, అసిస్టెంట్ కమిషనర్ పి. చిరంజీవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూగతంలో మాజీ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికేట్ కోసం నెట్ సెంటర్లకు తిరుగుతూ ఇబ్బందులు పడిన పరిస్థితులను గుర్తుచేశారు. పెన్షనర్లు ఇప్పుడు తమ స్మార్ట్‌ఫోన్ ద్వారా సులభంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించినందుకు సీఎంపిఎఫ్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. యాప్ ఉపయోగించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నట్టు పేర్కొన్నారు. సైబర్ మోసాలపై ప్రత్యేక హెచ్చరిక ఇటీవలి కాలంలో పెరిగిన సైబర్ మోసాలను గుర్తుచేస్తూ, పెన్షన్‌కు సంబంధించిన ఓటీపీ అడిగే అనుమానాస్పద ఫోన్‌కాల్స్‌ను నమ్మరాదని తెలిపారు. అవసరమైతే నేరుగా సీఎంపిఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. తర్వాత సీఎంపిఎఫ్ అధికారులు ప్రజెంటేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ ఆన్‌లైన్ సమర్పణ విధానాన్ని చూపించారు. ఇప్పటికే జీవన్ ప్రమాణ్ చేసిన పెన్షనర్లకు కూడా యాప్ ద్వారా సర్టిఫికేట్ అప్‌డేట్ చేసుకునేందుకు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా పెన్షనర్లు, సిపిఆర్‌ఎంఎస్ కార్డు దారులు పాల్గొని తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌లను విజయవంతంగా అప్‌డేట్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు, యూనియన్ ప్రతినిధులు, సంక్షేమ విభాగ సిబ్బంది, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, మాజీ సింగరేణి ఉద్యోగులు, సీఎంపిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

## బడి బలం.. తల్లిదండ్రులే!

- తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే బడి అభివృద్ధి
- ఉపాధ్యాయుల కృషితో విద్యార్థుల ప్రతిభ పుంజం
- ప్రతి నెల సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచనలు




**టేకులపల్లి, నవంబర్ 14 :** టేకులపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముత్యాలపాడు (హెచ్‌సి), బొమ్మనపల్లి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను అదనపు కలెక్టర్ విద్యా చందన సందర్శించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలతో నివాళి అర్పించారు. అనంతరం తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కీలకమని, చైతన్యవంతమైన తల్లిదండ్రుల సహకారంతోనే పాఠశాల పురోగతి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పాఠశా ల కోసం తల్లిదండ్రులు చూపుతున్న శ్రద్ధ అభినందనీ యమని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల ప్రగతి కోసం ప్రణాళికాబద్ధంగా పాఠాలు బోధించడమే కాకుండా, బడి అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ కృషితో విద్యార్థులలో అద్భుతమైన అభ్యాస సామర్థ్యాలు వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి యస్.కె.సైదులు మాట్లాడుతూ తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందించి, బడి విద్యా ప్రగతికి దారితీస్తాయని చెప్పారు. ప్రతి నెల తప్పకుండా సమావేశాలకు హాజరై పాఠశాల అభివృద్ధి, పిల్లల ప్రగతిపై చర్చించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త ఎన్.సతీష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా అవసరమైన బెంచీలను అందించనున్నట్టు తెలిపారు. ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పై అధికారులకు పంపించామని, అవి త్వరలో ఆమోదం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బొమ్మనపల్లి పాఠశాల విద్యార్థులకు బెల్టు, టైలు కూడా పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించాయి. చిన్నారుల ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు యస్.కె.సైదులు, ఎన్.సతీష్ కుమార్, ఎంఈడీవో మల్లీశ్వరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంగీలాల్, రామచందర్ సింగ్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, పద్మ, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అటవీ భూముల రక్షణ.. అందరి బాధ్యత

- గిరిజనుల జీవనోపాధి బలోపేతంతోనే అటవీ సంరక్షణ
- పోడు నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- అటవీ-పర్యాటక అభివృద్ధికి నూతన మార్గాలు




**భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్ 14:** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన ఐడిఓసి కార్యాలయంలో జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అటవీ భూముల రక్షణ అందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు పోడు నరికకుండా నిలువరించేందుకు వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించడం అత్యవసరమని చెప్పారు. గుత్తికోయ గిరిజనుల నివాస గుంపులపై పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసి అవసరమైన సౌకర్యాలు అందించాలని ఆదేశించారు. ఇప్పటికే నరికిన పోడు ప్రదేశాల్లో వెంటనే వెదురు నాటాలని సూచించారు. గిరిజనులకు చేపల పెంపకం, జీవనోపాధి కేంద్రాలు, నైపుణ్య శిక్షణలు అందిస్తే పోడు నరికే పరిస్థితులు తగ్గుతాయని వ్యాఖ్యానించారు. జీవనోపాధి కల్పించిన తర్వాత కూడా పోడు నరికితే పీడీ చట్టం అమలు చేయాలని హెచ్చరించారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌కి జిసిసి ద్వారా సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అటవీ అనుమతులు, పెండింగ్ పనులు, సంరక్షణ చర్యల పురోగతిని సమీక్షించారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ గిరిజనుల జీవనోపాధి మెరుగుపడేలా పునర్వనీకరణ, అభివృద్ధి ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పోడు నరికే ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావే శంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, విద్యుత్ శాఖ అధికారి మహేందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుమ్మడవల్లిలో బాలల దినోత్సవం




**అశ్వారావుపేట, నవంబర్ 14:** అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి కాంప్లెక్స్ పరిధిలో ఉన్న గుమ్మడవల్లి హైస్కూల్‌లో నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి వీరేశ్వర రావు వెల్లడించిన వివరాల ప్రకారం, పాఠశాల ఆవరణ ఆనందంతో, ఉత్సాహంతో నిండిపోయింది. విద్యార్థుల సృజనాత్మకత, ఉపాధ్యాయుల సహకారం, తల్లిదండ్రుల సమష్టి సహభాగిత్యంతో ఈ కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎంసి కమిటీ సభ్యుల సమావేశాన్ని కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు, నాణ్యమైన బోధన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి తీర్మానాలు చేశారు. కమిటీ సభ్యులు పాఠశాల శ్రేయస్సుకు తమవంతు సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బాలల దినోత్సవ వేడుకల్లో విద్యార్థిని-విద్యార్థులు గురువుల విభిన్న వేషాల్లో క్లాసులు తీసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు పాఠ్యాంశ బోధన చేస్తూ తమ ప్రతిభను చూపగా, ఉపాధ్యాయులు వారిని ఉత్సాహపరిచారు. వివిధ కళారూపాలు, నృత్యాలు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## గ్రంథాలయ వారోత్సవాలకు కలెక్టర్ శుభారంభం

- పుస్తక పఠనమే నిజమైన జ్ఞాన మార్గం
- పిల్లల దినోత్సవంతో వారోత్సవాలకు మంచి ప్రారంభం
- 20 వరకు ఆకర్షణీయ కార్యక్రమాలు



**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 14:** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం, భద్రాద్రి కొత్తగూడెం లో కార్యక్రమాలు 14 నవంబర్ నుంచి ప్రారంభమయ్యాయి. కలెక్టర్ జితేష్ వి పాటేల్ జ్యోతి ప్రజ్వలన చేసి, నెహ్రూ మరియు ఎస్.ఆర్. రంగనాథన్‌ల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పసుపులేటి వీరబాబు తెలిపారు. వారోత్సవాల తొలి రోజు పిల్లల దినోత్సవం సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారని. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూగ్రంథాలయాలు తన విద్యార్థి దశలో ఎంతగానో ఉపయోగపడ్డాయని, నేటి తరానికి అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు మరింత అవకాశాలను సృష్టిస్తున్నాయని అన్నారు. పుస్తక పఠనం ఇంటర్నెట్, వైఫై కంటే ఎంతో ముఖ్యమని, పుస్తకాల ద్వారానే స్థిరమైన విజ్ఞానం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రంథాలయ మౌలిక వసతుల అభివృద్ధికి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ నవీన్ కుమార్, గ్రంథపాలకురాలు జి. మణిమృదుల, శాఖ గ్రంథపాలకులు మధుబాబు, వాణి, జానీ, రుక్మిణి పాల్గొన్నారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలతో కొనసాగనున్నాయి.




## బాల్యవివాహాలకు చెక్.. భద్రాద్రి లక్ష్యం

- వందరోజుల ప్రచారోద్యమానికి నాంది
- బాల్యవివాహ నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకం
- చైల్డ్ లైన్ 1098 ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్ 14:** భద్రాద్రి జిల్లాను పూర్తిగా బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన కోసం చేపట్టిన వందరోజుల ప్రచార ఉద్యమ గోడపత్రికను ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు లేని తెలంగాణ లక్ష్యం సాధనలో భద్రాద్రి జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందాలి అని అన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయి కార్యకర్తలు, ప్రజలు కలిసి పనిచేస్తే ఈ లక్ష్యం చేరుకోవడం సాధ్యమని చెప్పారు. స్వయం సహాయక బృందాలు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు ప్రచార ఉద్యమంలో ముందుండాలని, మహిళలు సంకల్పిస్తే సామాజిక మార్పు తప్పక సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆడపిల్లల భవిష్యత్తును అడ్డుకునే బాల్యవివాహాలు పూర్తిగా నిషేధించాల్సిందే అని స్పష్టం చేశారు. ఎవరైనా బాల్యవివాహం చేయడం, ప్రోత్సహించడం, సహకరించడం చేసినా చట్టపరంగా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. బాలల సమస్యలు, బాల్యవివాహాల సమాచారం వంటి అంశాలను 24 గంటలు పనిచేసే చైల్డ్ లైన్ 1098 కు వెంటనే తెలపాలని సూచించారు. జిల్లా బాలలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి బాలుడు సురక్షితమైన, ఆనందకరమైన వాతావరణంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి.రాజేష్, బృంద సభ్యులు మాన్సింగ్, జ్యోతి, మోహన్, మౌనిక పాల్గొన్నారు.





## జూబ్లీహిల్స్ విజయంతో దమ్మపేటలో సంబరాలు

**అశ్వారావుపేట, నవంబర్ 14:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడంతో దమ్మపేటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ విజయోత్సవాలు నిర్వహించారు. పట్టణ కేంద్రంలో బాణసంచా కాల్చి, నినాదాలతో సంబరాలు కొనసాగించారు. తదుపరి దమ్మపేట పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మారప్పగూడెం, పెద్ద గొల్లగూడెం, దమ్మపేట పట్టణంలో పలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు జరిగాయి. నాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

